# ★ భంగపాటు ★

అవసరాల రామకృష్ణారావు

రవణమూర్తి బద్ధకంతో ఒళ్లు విరుచుకున్నాడు. అతను పావుగంటై అలా ఆ కుక్కి మంచంమీద పడుకుని ఆలోచిస్తున్నాడు—లేచి చేసే దేముంది గనుక? అలా పడుకున్న కొద్దీ ఆ ఆలోచనా ప్రవాహానికి అంతేమిటి? రవణమూర్తికి హఠాత్తుగా చైతన్యం కలిగింది - లేచి కూర్చున్నాడు. 'ఈ లోకంలో బాహ్య ప్రకటన ఉంటేగాని స్థానమే లేదు' అనుకున్నాడు.

ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మామూలు బట్టలతో ఏదో గొప్పవాళ్ళ యింటికి విందుకు వెళితే, గేటు దగ్గిర నౌఖరులు యితని వేషం చూసి అటకాయించారుట. అయనే సూటూ బూటూ వేసుకుని వెడితే అతనిని అతి మర్యాద చేసి ఆహ్వానించారుట. - తనూ అలా చేస్తే?

మురికి బట్టలూ, పెరిగిన గెడ్డం, మోహం నిండా చెమటతో మూడు రోజులు తిరిగినా ఆఖరికి ఉద్యోగమూ దొరకలేదు. కడుపు నిండనూ లేదు! - ఇహ యిలా తిరుగుతే లాభం లేదు, బాహ్య వేషమే ప్రధానం. - రవణమూర్తికో చైతన్యం కలిగి లేచి కూర్చున్నాడు!

పెట్టె యిల్లంతా వెతికితే మూడు కానులు దొరికేయి. క్షురకర్మ పూర్తి గావించుకొన్నాడు. బొక్కి దువ్వెనతో తల దువ్వుకొన్నాడు, చింకి చొక్కా ఫేంట్లో దోపుకున్నాడు. బయలుదేరేడు, ఎక్కడికి? దేశంమీదకి.

'ఏమోయ్ మూర్తీ!' రవణమూర్తి వెనక్కి తిరిగి చూశాడు. - అతని పాత మిత్రుడు వేణుగోపాల్. అతన్ని కలుసుకుని ఎన్నాళ్లో అయింది. ఎంతలో మారిపోయాడు! 'ఎక్కడికేమిటి?' అన్నాడు వేణు. మూర్తి చిక్కులో పడ్డాడు. ఎక్కడికని చెప్తాడు? 'అలా వెళ్లి కాస్త కాఫీ తాగి వద్దామని' అన్నాడు యుక్తిగా. 'నేనూ అక్కడికే, పద' అన్నాడు వేణు. మూర్తి గుండెల్లో రాయి పడింది. ఏదో వీడు వదిలి పోతాడేమో అని అన్నాడు గాని కాఫీ హోటలుకు వెళ్లడానికి తనకి డబ్బేది? రవణమూర్తికి హఠాత్తుగానే ఆలోచన తట్టింది. వీడు చూస్తే మస్తుగా డబ్బున్న వాడిలా ఉన్నాడు; బిల్లు వాడి మొహాన్నే పారేస్తే సరి! ఇద్దరూ కాఫీ దేవాలయ ప్రవేశం చేశారు. మూలనున్న రెండు కుర్చీల్లో అలంకరించారు. సెర్వరు వచ్చాడు. రెండు యిడ్లీ ఆర్డర్ చేశాడు వేణు. - ఇడ్లీ తింటున్నాడే గాని రవణమూర్తి పిరికి గుండె కొట్టుకుంటూనే ఉంది. - వేణు రెండు దోసెలు, పూరీ ఉప్మా ఆర్డరు చేశాడు అతి ధైర్యంగా. రవణమూర్తికి అధైర్యం కలిగి ఓ మారు వేణుగోపాల్ వైపు చూశాడు. అతని బుష్ కోట్ చూసేసరికి మూర్తికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. రెండు పూరీలు మడతబెట్టి లోపలికి తోసేసాడు- అయ్యరు రెండు కప్పుల కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు. దాంతో రెండు రూపాయల బిలు తెచ్చి బల్లమీద పెట్టేడు.

ఆ బిల్లు కొంచెం రవణమూర్తి వైపుకే ఉంది. వేణు గోపాల్ కాఫీ తాగుతున్నాడు. రవణమూర్తి నెమ్మదిగా బిల్లుతీసి వేణు ముందు పెట్టేడు. విజయగర్వంతో కాఫీ తాగి కప్పు క్రింద పెట్టేడు. ఆశ్చర్యం, బిల్లు రవణమూర్తి వైపే ఉంది - రవణమూర్తికి ముచ్చెమటలు పోశాయి.

'బ్రదర్, యిక్కడే వుండు, ప్రక్కకొట్లో రెండు కిళ్లీలు కట్టించుకొస్తా' తిరిగి జవాబుకేనా చూడకుండా వేణుగోపాల్ దాటేశాడు! రవణమూర్తి నోరు అప్రయత్నంగా 'ఆ' అని తెరచుకుంది!

మోసంలో సాహసం ఉండాలి - తను ఏ ఉద్యోగానికీ సరిపోడు సరికదా తనకి మోసం చెయ్యడం కూడా రాదు! వేణుగోపాల్ వేష బలంతో అయిదునిమిషాల్లో తననే మోసం చేసాడు

'ఏందిరా ఆలోచిస్తూ ఉండావ్, దుడ్డు కుడుమా, శీఘ్రం.' రవణమూర్తి తలెత్తి చూశాడు. అయ్యరు సాతాని జియ్యరులా చూస్తున్నాడు- ఇక ప్రా సీదేమిటి, జరగవలసింది జరిగింది——

మరునాడు నేను వారింటికి వెళ్లి 'ఏమిరో భాయ్ ఏం చేస్తున్నావురా!' అని అడిగేసరికి, వాడు 'వీపు తడమురా తెలుస్తుంది' అన్నాడు. వీపు స్పృశిదుమా మా పూరి నల్లచెరువు మెట్లల్లాగుంది!